క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

తలకొండపల్లి: ఆమనగల్లు పట్టణంలో నేడు (గురువారం) రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి జన్మదినం సందర్భంగా భారతీయ జనతా యువ మోర్చా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బ్లెడ్ సెంటర్ మహబూబ్‌నగర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న రక్తదాన శిబిరానికి మండలంలోని ఆయా గ్రామాల యువకులు అధిక సంఖ్యలో హాజరై తమ రక్తాన్ని దానం చేయగలరని ఆయన కోరుచున్నారు.

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద నేడు(బుధవారం) జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి జన్మదిన సందర్భంగా రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం కల్వకుర్తి ఇన్‌చార్జి అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు రక్తదానం చేయాలని కోరారు.

మల్లురవికి శుభాకాంక్షలు


ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

కడ్తాల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన డాక్టర్ మల్లురవిని, మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లురవికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి,గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు లక్ష్మినాయక్, జహంగీర్ అలీ, ఆనంద్ తదితరులు ఉన్నారు.

108 వాహనం తనిఖీ


అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

మంచాల: మండల కేంద్రంలో 108 వాహనాన్ని బుధవారం ఆకస్మికంగా ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. వాహనంలో ప్రాథమిక చికిత్సకు సంబంధించిన మెడిసిన్ అందుబాటులో ఉన్నాయాని పరిశీలించారు. అలాగే, అంబులెన్స్‌లోని అన్ని పరికరాలు పని చేస్తున్నాయా లేదాని తనిఖీ చేశారు. అనంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారో లేదాని విచారించారు. కార్యక్రమంలో 108 ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, జిల్లా కో–ఆర్డినేటర్ రాజాబాబు, పైలెట్ రాజు, ఈఎంటీ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థిని ప్రతిభ


ప్రనుష

ఆమనగల్లు: వైద్య విద్య ప్రవేశానికి నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని ఆకుతోటపల్లికి చెందిన విద్యార్థిని సీత ప్రనుష 640 మార్కులు సాధించి ఉత్త మ ప్రతిభ కనబర్చింది. ఆకుతోటపల్లి గ్రా మానికి చెందిన సీత సంతోష, కృష్ణ దంపతుల కుమార్తె ప్రనుష మొదటి ప్రయత్నంలోనే నీట్‌లో ప్రతిభ కనబర్చింది. దీంతో ఆమెను పలువురు అభినందించారు.

సిమెంట్ కుర్చీలు ఏర్పాటు


కుర్చీలు ఏర్పాటు చేస్తున్న నాగరాజు తదితరులు

యాచారం: మండలంలోని నందివనపర్తి గ్రామంలో ఇటీవల బీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టు సభ్యులు గ్రామంలో సిమెంట్ ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో పలు గ్రామాల నుంచి క్రీడా జట్లు పాల్గొన్నాయి. ఎన్‌పీఎల్ సీజన్–3 విజేతగా నందివనపర్తి టీం గెలిచింది. గెలుపొందిన క్రీడాకారులు తమకు వచ్చిన నగదుతో మరింతా డబ్బు జమ చేసి గ్రామంలోని పలు కాలనీల్లోని చౌరాస్తాలో సిమెంట్ కుర్చీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీం కెప్టెన్ నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం కలేనా?

- బీటీ రోడ్డుకు నోచుకోని మైసిగండి–గోవిందాయిపల్లి
- ఆర్టీసీ బస్సు ఎరుగని గ్రామస్తులు
- తమ గోడు పట్టించుకోవాలని అభ్యర్థన


వర్షానికి బురదమయంగా మారిన గోవిందాయిపల్లి– మైసిగండి గ్రామాల మధ్య మట్టి రోడ్డు

కడ్తాల్: స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా నేటికి కొన్ని గ్రామాలు బీటీ రహదారికి నోచుకోక రాకపోకలకు ఇక్కట్లు పడుతూ దర్శనమిస్తున్నాయి. ఇదేక్కడో మారుమూల పల్లె అనుకుంటే పొరపాటే.. రాష్ట్ర రాజధానికి సమీపంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై, మైసిగండి గ్రామం నుంచి 3 కిలో మీటర్ల దూరంలో ఉండే గోవిందాయిపల్లి పరిస్థితి. గ్రామ ప్రజలకు రహదారి సక్రమంగా లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. బీటీరోడ్డు లేక పోవడంతో గ్రామానికి ఆర్టీసీ బస్సు కూడా రావడం లేదు. వర్షాకాలంలో చినుకుపడితే రోడ్డంతా చిత్తడిగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్డు ఉన్న కనీసం ఆటోలు నడవని పరిస్థితి. ప్రజలు హైదరాబాద్, కల్వకుర్తి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే మైసిగండి వరకు కాలినడకన రావాల్సిందే. పాలకులు మారిన ప్రభుత్వాలు మారిన తమ సమస్యలను పట్టించుకునే వారు లేరని గ్రామప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఏళ్లుగా బీటీకి రోడ్డు..

కడ్తాల్ మండలంలోని గోవిందాయిపల్లి గ్రామానికి బీటీరోడ్డు నిర్మించాలని గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకునే వారే లేరని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గతంలో కర్కల్‌పహాడ్ గ్రామ పంచాయతీలో ఉన్న గోవిందాయిపల్లి నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు సందర్భంలో, గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు గుంతల మయంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రత్యేకించి వర్షాకాలంలో రోడ్డు పూర్తిగా గోతులు పడి, అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.

బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తే...

మైసిగండి నుంచి గోవిందాయిపల్లి మీదుగా ఎక్వాయిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మించి, ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తే గోవిందాయిల్లి ప్రజలు, విద్యార్థులకు, రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అలాగే, ఎక్వాయిపల్లి నుంచి గోవిందాయిపల్లి మీదుగా మైసిగండి వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తే మండల కేంద్రానికి దూరం తగ్గుతుంది. రవాణా సదుపాయం మెరుగుపడుతుంది. మైసిగండి నుంచి గోవిందాయిపల్లి, ఎక్వాయిపల్లి, మీదుగా బీటీ రోడ్డు నిర్మాణం చేపడితే మండల పరిధిలోని చరికొండ, ముద్విన్, ఎక్వాయిపల్లి గ్రామాల ప్రజలకు, మండల కేంద్రానికి సుమారు 4 కిలో మీటర్ల దూర భారం తగ్గుతుంది. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మైసిగండి నుంచి గోవిందాయిపల్లి, అక్కడి నుంచి ఎక్వాయిపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని గోవిందాయిపల్లి గ్రామస్తులతో పాటు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దూరం తగ్గుతుంది



ఎక్వాయిపల్లి నుంచి గోవిందాయిపల్లి మీదుగా మైసిగండికి బీటీ రోడ్డు నిర్మాణం చేస్తే, కడ్తాల్‌కు వెళ్లేందుకు, ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ గ్రామాల ప్రజలకు 4 కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. బస్సు సౌకర్యం కల్పిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

– వల్లపుదాస్ జంగయ్య,
గీత కార్మికుడు, గోవిందాయిపల్లి

బీటీ రోడ్డు నిర్మించాలి



గోవిందాయిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలి. రోడ్డు నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఎన్నో ఏళ్లుగా కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. బీటీరోడ్డు నిర్మిస్తే ప్రజలకు, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

– ఎల్లాగౌడ్, మాజీ ఉప సర్పంచ్ , గోవిందాయిపల్లి

ప్రతిపాదనలు పంపించం



బీటీ రోడ్డు ఏర్పాటుకు సంబంధించి గత ఏడాది క్రితమే ప్రతిపాదనలు పంపించడం జరిగింది. రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– పరమేశ్, పీఆర్ ఏఈ, కడ్తాల్

చదువుతో పాటు క్రీడలు అవసరం


విద్యార్థినిని సత్కరిస్తున్న ఎస్ఐ వెంకటనారాయణ

ఎస్ఐ వెంకటనారాయణ

యాచారం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని ఎస్ఐ వెంకట నారాయణ పేర్కొన్నారు. వేసవి సెలవులను పురస్కరించుకుని చింతపట్లలో మన ఊరు–మన బడి ఆధ్వర్యంలో ఆంగ్లబోధన, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు పలు గ్రామాల విద్యార్థులు హాజరయ్యారు. ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి కష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఆంగ్లబోధన, క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాబేర్, అంజయ్య, జహంగీర్, శ్రీహరి, శ్రీకాంత్, జాతీయ అవార్డు గ్రహీత లిక్కి అనురుద్రారెడ్డి, గ్రామస్తులు లిక్కి సుధాకార్‌రెడ్డి, బిక్షపతి, వేణు, చరణ్, ముత్యాలు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో బీజేపీ సంబరాలు


తలకొండపల్లిలో నాయకుల సంబరాలు

తలకొండపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు విజయోత్సవ సంబురాలు జరిపారు. బుధవారం బీజేపీ నాయకులు మండల కేంద్రంలో విజయోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ సభ్యురాలుగా డీకే అరుణమ్మ గెలుపొందారు. అలాగే, రాష్ట్రంలో ఎనిమిది లోక్‌సభ స్థానాలను భారీ మెజార్టీతో బీజేపీ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు బాణా సంచా కాల్చి, స్వీట్లు పంచారు. గ్రామ ప్రధాన కూడళ్ల మీదుగా పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. జై మోడీ, జైజై మోడీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సంబురాలు జరిపారు. కార్యక్రమంలో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి పాండు, జిల్లా పబ్లిసిటీ కన్వీనర్ మహేశ్, ఎంపీటీసీ హేమరాజు, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, శ్రీశైలం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి


విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి రాజు

మండల వ్యవసాయాధికారి రాజు

తలకొండపల్లి: ఎరువుల దుకాణాల యజమానులు ఎమ్మార్పీ ధరలకే విత్తనాలను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రాజు అన్నారు. కొనుగోలు చేసిన రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని చెప్పారు. మండల కేంద్రంలోని జైకిసాన్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, వెల్జాల్ గ్రామంలోని న్యూస్వామి ట్రేడర్స్, ఓం సాయి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, తదితర విత్తన, ఎరువుల దుకాణాలను ఏవో బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏటధరల పట్టిక, బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, ఈ–పాస్ మెషీన్ పనితీరు, అమ్మకాల వివరాలు, ధరల వివరాలను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయించితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత కలిగిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. నిబంధనలు పాటించని దుకాణ యజమానులపై చర్యలు ఉంటాయన్నారు. పత్తి, మొక్కజొన్న, వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఈ–పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలి


ఎరువుల షాపులను తనిఖీ చేస్తున్న అరుణకుమారి

ఆమనగల్లు: ఈ పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి విత్తనాలు, ఫర్టిలైజర్ షాపుల యజమానులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ఆయా రైతు సేవా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపులలో ఉన్న ఎరువులు, విత్తనాల నిలువలను పరిశీలించారు. రిజిస్టర్‌ను పరిశీలించి ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. షాపు ఎదుట ధరలు, స్టాక్ వివరాలు ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ.. విత్తనాలు అధిక ధరలకు విక్రయించినా, కొరత సృష్టించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో షాపుల డీలర్లు వెంకటయ్య, చంద్రమౌళి, భరత్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, అశోక్ తదితరులు ఉన్నారు.

స్కూల్ యూనిఫాంలు సిద్ధం!


మంచాలలో స్కూల్ యూనిఫాంలు కుట్టుతున్న మహిళలు


యూనిఫాంలను పరిశీలిస్తున్న పీడీ శ్రీలత తదితరులు (ఫైల్)

- మండల వ్యాప్తంగా 3112 మంది విద్యార్థులు
- స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగింత

మంచాల: గతంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను స్కూల్ యూనిఫాంల సమస్య తీవ్రంగా ఉండేది. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడిచిన పూర్తిస్థాయిలో విద్యార్థులకు సరిపడా యూనిఫాంలు ఇచ్చే వారు కాదు. ఈసారి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసే యూనిఫాంలు ఇప్పటికే సిద్ధం చేశారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచాల మండలంలోని ప్రభుత్వం పాఠశాలలో చదువుకునే విద్యార్థులు 3,112 మంది ఉన్నారు. వారిలో 1368 మంది బాలురులు, 1744మంది బాలికలు ఉన్నారు. వారందరికీ సకాలంలో యూనిఫాంలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దీంతో విద్యాశాఖ–జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలకు అప్పగించింది. మండలంలో మంచాల, ఆరుట్ల, నోముల, జాపాల గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులచే యూనిఫాంలను కుట్టించడం జరుగుతుంది. ఆయా గ్రామాల్లో 50 మంది మహిళలకు పైగా స్కూల్ యూనిఫాంలు కుట్టె పనిలో ఉన్నారు. ఇప్పటి వరకు 3 వేలకు పైగా యూనిఫాంలు కుట్టారు. పాఠశాలలు ప్రారంభం నాటికి పూర్తి స్థాయిలో యూనిఫాంలు పాఠశాలలకు అందజేస్తామని చెబుతున్నారు.

మంచి కార్యక్రమం



మహిళలచే స్కూల్ యూనిఫాంలు కుట్టించడం మంచి ఉద్దేశం. ప్రభుత్వం మహిళలకు కుట్టుమిషన్లు కుట్టడం నేర్పించింది. వారికి యూనిఫాంలు, ఇతర కార్యాలయంలో పని చేసే వారికి అందించే యూనిఫాంలు పూర్తిగా వీరికే అప్పగించాలి. – లక్ష్మాలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు, మంచాల

మహిళలు ముందుకు రావాలి



ప్రభుత్వం కల్పించే ప్రతి అవకాశం సద్వినియోగం చేసుకోవడానికి మహిళలు ముందుకు రావాలి. అప్పుడే స్వయం శక్తితో ఎదగడానికి అవకాశం ఉంటుంది. డబ్బులు పొదుపు చేసుకోవడంతో పాటు పని చేసి ఆర్థికంగా ఎదగాలి.

– ఆకుల శోభ (ఏపీఎం) మంచాల

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం


యాచారం: మొక్క నాటుతున్న ఎంపీపీ సుకన్య


మొక్కలు నాటుతున్న రాజేందర్‌రెడ్డి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: పర్యావరణ పరిరక్షణే లక్ష్యమని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మల్కీజ్‌గూడ గ్రామంలో బుధవారం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ.. పర్యావరణ రక్షణకు ప్రతిఒక్కరూ ఐదు మొక్కల చొప్పున నాటాలన్నారు. మొక్కలు విరివిగా నాటడంతో చెట్లు పెరిగి వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈజీఎస్ నిధుల ద్వారా ప్రతి గ్రామంలో నర్సరీలు పెంచి వేలాది మొక్కలు నాటామన్నారు. గ్రామాల్లో చెట్లు నరికితే బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చట్టం తేవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని మొక్కలు నాటి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మల్కీజ్‌గూడ ఎంపీటీసీ సభ్యురాలు శారద, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

హయత్‌నగర్: పారిశ్రామిక వ్యర్థాలు, ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతిని భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందడం కష్టమవుతుందని గాంధీగ్లోబల్ ఫ్యామిలీ సంస్థ చైర్మన్ రాంచందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కుంట్లూర్‌లోని గాంధేయన్ కళాశాలల ఆవరణలో మొక్కలను నాటారు. ఆయన మట్లాడుతూ.. కాలుష్య కారకాల వాడకాన్ని పూర్తిగా నిషేధించి మొక్కలను పెంచడంతో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చన్నారు. ఇంకుడు గుంతలతో వర్షం నీటిని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమలో పలువురు పర్యావరణ వేత్తలు పాల్గొన్నారు.

పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి

క్రీడా క్షేత్రం ఎదుట కార్మికుల ధర్నా

యాచారం: గునుగల్‌లోని కేంద్రీయ మెట్ట పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వివరాలు.. గునుగల్ వ్యవసాయ మెట్ట పరిశోధన క్షేత్రంలో ఏళ్లుగా వందలాది మంది కార్మికులు కాంట్రాక్ట్ కింద విధులు నిర్వహిస్తున్నారు. వారికి సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడంతో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు మెరుపు ధర్నాకు దిగారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ... కార్మికులను వెంటనే పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. క్షేత్రంలో పనులు లేవని ప్రతి యేటా కొంతమంది తొలగిస్తున్నారని.. ఇది సమంజసం కాదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృత్తం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, నాయకులు నర్సిరెడ్డి, రాములు, యాదయ్య, బాలశివుడు పాల్గొన్నారు.

నేటి నుంచి బడిబాట


ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం నుంచి చేపట్టనున్నట్లు మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈనెల 19 వరకు జరిగే కార్యక్రమలో బడీడు పిల్లలను, డ్రాపట్స్‌ను బడుల్లో చేర్పించడం, చదువు పట్ల అవగాహన కల్పించడంపై తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు.

పుస్తకాల పంపిణీ..

ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. శేరిగూడ, రాయపోల్, ఎంపీ పటేల్‌గూడ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ పుస్తకాలను మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి అందజేశారు. మిగతా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠ్య,నోట్ పుస్తకాలను తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకుడు పరమేష్, ఉపాధ్యాయులు రాములు, మహేశ్, సీఆర్పీలు శేషు, రఘు, అశోక్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు, కవాడిపల్లికి చెందిన కొలన్ కృష్ణారెడ్డి మే 5న మృతిచెందాడు. దీంతో సహకార సంఘం తరఫున బాధ్యత కుటుంబానికి రూ. 25వేల ఆర్థిక సహాయం బుధవారం చైర్మన్ భరత్‌కుమార్ చేతులమీదుగా మృతుడి కుమారుడు కొలన్ ప్రేమ్‌లోకొరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, మేనేజర్ ఐలేష్‌యాదవ్, భాస్కర్ పాల్గొన్నారు.